సమస్యలతో సహవాసం



గొలగాని వారి కల్లాలలో డ్రైనేజీలు లేక నివాసాల మధ్య నిల్వ ఉన్న మురుగు



శిథిలమైన సీసీ రోడ్డు

- తాళ్లవలస పంచాయతీ గొలగాని వారి కల్లాలుకు అసౌకర్యాల నుసీ
- ఇటీవల పదుల సంఖ్యలో డయేరియా బారిన పడిన గ్రామస్తులు
- కలుషితమవుతున్న బోర్లు
- డ్రైనేజీలు లేక ఇళ్ల మధ్యే ఇంకిపోతున్న మురుగు
- వసతులు కల్పించాలని స్థానికుల విజ్ఞప్తి

తగరపువలస: భీమిలి మండలం తాళ్లవలస పంచాయతీలోని గొలగాని వారి కల్లాలుకు చెందిన గ్రామస్తులు అనేక సమస్యలతో సహవాసం చేస్తున్నారు. ఈ గ్రామానికి చెందిన పది మంది ఇటీవల డెంగీ బారిన పడి లేచారు. ఒకరిద్దరు ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయించి జేబులు గుల్ల చేసుకున్నారు. ఇక్కడంతా రోజువారీ కూలీలే కావడంతో పక్కనే ఉన్న పీహెచ్‌సీని ఆశ్రయించి ఉపశమనం పొందారు. పంచాయతీ పాలకవర్గం మొక్కుబడిగా గ్రామంలో బ్లీచింగ్ చల్లించి మమ అనిపించింది. ఇంతటితో గొలగాని వారి కల్లాలకు ముప్పు తప్పిందనుకుంటే పొరపాటే. ఆ గ్రామం చుట్టూ, మధ్యలో అధ్వాన పారిశుధ్య పరిస్థితుల కారణంగా నివాసులకు నిప్పుల కుంపటిపై ఉన్నట్లం చేస్తున్నారు.

ఇవీ సమస్యలు..

ఈ గ్రామంలోని బోర్లు కలుషితమై విషం, మట్టి చిమ్ముతున్నాయి. 150 కుటుంబాలకు పైగా ఉంటున్న వీరికి రెండే వీధి కుళాయిలు. పీహెచ్‌సీ వద్ద ఓవర్‌హెడ్ ట్యాంకు నుంచి సరిపడా తాగునీరు రాక కలుషిత నీటినే తాగుతున్నారు. గ్రామంలో డ్రైనేజీలు లేక ఇళ్ల మధ్యే మురుగు నెలల తరబడి నిలిచిపోయి దోమలు, ఈగలు సంతానాన్ని వృద్ధి చేసుకోవడానికి దోహదపడుతున్నాయి. సొంతంగా డ్రైనేజీ నీటిని ఊరు దాటిద్దామన్నా.. వీరి వల్ల కావడం లేదు. దీంతో మురుగు మధ్యే అనారోగ్య సమస్యలతో సహవాసం చేస్తున్నారు. అలాగని గ్రామంలో రహదారులైనా బాగా ఉన్నాయా అంటే అదీ లేదు. శిథిలమైన సీసీ రోడ్లు, మట్టి రోడ్లు, కాలిబాటలే శరణ్యం.



స్థానికులు స్వయంగా మురుగు నీటిని మళ్లించుకుంటున్న దృశ్యం

గ్రామస్తుల గోడు పట్టించుకోండి

పంచాయతీలో మెజారిటీ వర్గం ఉండే గొల్లల తాళ్లవలసలో నివసించేది అంతా యాదవులే. వెనుకబడిన సామాజిక వర్గానికి చెందిన వీరి గ్రామాల్లో అభివృద్ధి అంతంత మాత్రమే. కొంత కాలంగా సర్పంచ్‌లుగా యాదవేతరులే ఎన్నికవుతూ వస్తున్నారు. దీంతో వీరు గొల్లల తాళ్లవలస అభివృద్ధిని పట్టించుకోవడం లేదు. అడపాదడపా గొల్లల తాళ్లవలసకు చెందిన వారు ఎంపీటీసీ సభ్యులుగా ఎన్నికవుతున్నా.. మౌలిక వసతులైన రహదారులు, డ్రైనేజీలు, వీధిలైట్లు సరిచేసుకోలేక తమను ఉద్ధరించే వారి కోసం ఎదురు చూస్తున్నారు. ముఖ్యంగా గొలగాని వారి కల్లాల పరిస్థితి కూడా అలాగే ఉంది. ముఖ్యంగా 6వ వార్డులో తాము పడుతున్న పాట్లు చూసి ప్రభుత్వాలు, అధికారులు మెరుగైన వసతులు కల్పించాలని గ్రామస్తులు వేడుకుంటున్నారు. మరోమారు తమను వ్యాధులు బాధించకుండా ఒడ్డున పడేయాలని కోరుతున్నారు.

దయనీయంగా గ్రామ పరిసరాలు



గొలగాని వారి కల్లాలులోని పరిసరాలు దయనీయంగా మారాయి. తాగునీరు సక్రమంగా ఉండదు. డ్రైనేజీలు పాక్షికంగా మాత్రమే ఉన్నాయి. దీంతో ఇళ్ల మధ్యే మురుగు నిలిచిపోయి దోమలు వృద్ధి చెందుతున్నాయి. తరచూ వ్యాధుల బారిన పడుతున్నాం.

– గొలగాని సన్యాసిరావు, గ్రామస్తుడు

గ్రామాన్ని అభివృద్ధి చేయండి



గొల్లల తాళ్లవలస అభివృద్ధి చెందకపోయినా మా చుట్టూ స్థలాలు కొనుక్కొని కాలనీలు, అపార్ట్‌మెంట్లు నిర్మించుకున్న వాళ్లు వసతులు ఏర్పాటు చేసుకున్నారు. యాదవ పెద్దలు కూడా మా కల్లాలు అభివృద్ధిపై దృష్టి సారించింది లేదు.

– పాసి అప్పలనరసయ్య, స్థానికుడు

తక్షణం వసతులు కల్పించాలి



గొలగాని వారి కల్లాలుకు యుద్ధప్రాతిపదిన డ్రైనేజీలు, తాగునీరు సదుపాయం కల్పించాలి. లేదంటే వ్యాధులు మళ్లీ తిరగబెట్టే ప్రమాదముంది. రోడ్ల పునర్మిర్మాణానికి ప్రాధాన్యమివ్వాలి. ప్రభుత్వాలు మమ్మల్ని మనుష్యులుగా గుర్తించాలి.

– గొలగాని శ్రీను, స్థానికుడు



కలుషితమైన బోరు

తాగునీరు వృథా



శ్రమజీవుల కాలనీ రహదారిలో నీరు వృథాగా పోయి నాచుకట్టిన ప్రదేశం

తగరపువలస: ఆనందపురం మండలం శ్రమజీవుల కాలనీ మార్గంలో రహదారిపై కొంతకాలంగా తాగునీరు వృథాగా పోతోంది. వేములవలస మార్కెట్ నుంచి చందక వెళ్లే మార్గంలోని కొండవాలు కార్నర్‌లో ఈ తాగునీరు వృథాగా పోయి నాచుకట్టింది. ఆ చోట గొయ్యి కూడా ఏర్పడి దిగువ మార్గంలో చెరువులా మారింది. ఇరుకైన మార్గంతో కూడిన కార్నర్ కావడం వల్ల చీకటి పడిన తరువాత వాహనాలు ఇందులో ఇరుక్కుపోతున్నాయి. తాగునీరు వృథాను అరికట్టి లీకవుతున్న పైప్‌లైన్‌కు మరమ్మతులు చేయించాలని వాహన చోదకులు కోరుతున్నారు. అప్పటి వరకు ప్రమాదాలు జరుగకుండా పంచాయతీ అధికారులు కార్నర్‌లో పారిశుధ్య పనులు చేపట్టి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

బస్సు నుంచి జారిపడి విద్యార్థులకు గాయాలు

పీఎం పాలెం: ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న నలుగురు విద్యార్థులు ప్రమాదానికి గురయ్యారు. పీఎం పాలెం స్టేషన్ సీఐ బాలకృష్ణ తెలిపిన వివరాలిలా.. కొమ్మాదిలోని ఓ ప్రైవేట్ ఇంజినీరింగ్ కాలేజీలో చదువుతున్న పలువురు విద్యార్థులు శనివారం 25వ నంబర్ ఆర్టీసీ బస్సు ఎక్కారు. బీటెక్ సెకండియర్ స్టూడెంట్ ఇప్పిలి సాయి అదే బస్సు ఎక్కాడు. బస్సు రద్దీగా ఉండటంతో దాని డోర్ వద్ద మెట్లపై అతడు నిలబడ్డాడు. స్పీడ్ బ్రేకర్ వద్ద వేగం తగ్గించక పోవడంతో బస్సు ఎత్తి కుదేయడంతో కిందకు పడిపోయాడు. ఈ ఘటనలో సాయి తీవ్రంగా గాయపడగా.. మరో ముగ్గురు విద్యార్థులు జారిపడి గాయాల పాలయ్యారు. స్థానిక గాయత్రీ ఆస్పత్రిలో విద్యార్థి సాయి చికిత్స పొందుతున్నాడని సీఐ తెలిపారు.

పూడుకుపోయిన కాలువ

పద్మనాభం: మండలంలోని పాండ్రంగి పంచాయతీ కురపల్లిలో పైడు కాలువ మురుగునీటితో నిండిపోయి దుర్వాసన వస్తోంది. దోమలు వృద్ధి చెందడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. పద్మనాభం నుంచి తగరపువలసకు వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డు పక్కనే ఉన్న ఈ కాలువ మురుగుతో పూడుకుపోయి దర్శనమిస్తోంది. సంబంధిత అధికారులు స్పందించి ఈ కాలువలో పూడిక తీయడానికి చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

క్లుప్తంగా

పారిశుధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ



పారిశుధ్య కార్మికులకు దుస్తులు అందజేస్తున్న జీవీఎంసీ అధికారులు

కొమ్మాది: ఇటీవల విజయవాడలోని వరద ముంపు ప్రాంతాల్లో పారిశుధ్య పనులను చిత్తశుద్ధితో నిర్వహించిన పారిశుధ్య కార్మికుల సేవలను గుర్తించి జీవీఎంసీ కమిషనర్ డా.సంపత్ కుమార్ ఆదేశాల మేరకు శనివారం సాగర్ నగర్‌లో పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ లొడగల అప్పారావు, జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎం.కిషోర్‌కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవి తదితరులు పాల్గొన్నారు.

'సాహితీ ప్రవీణ' గ్రంథావిష్కరణ



గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ మంజుల, అధ్యాపకులు

భీమునిపట్నం: భీమిలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు అధ్యాపకులు డాక్టర్ దొడ్డి ప్రవీణ రచించిన సాహితీ ప్రవీణ గ్రంథం ఆవిష్కరణ కార్యక్రమం శనివారం ప్రిన్సిపాల్ డాక్టర్ మంజుల ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ గ్రంథంలోని వ్యాసాలు ఎంతో గొప్పగా ఉండి సమాజానికి ప్రయోజనకరంగా ఉన్నాయన్నారు. ఇటువంటి రచనలు రావడం ఎంతో అరుదైన విషయమని కొనియాడుతూ రచయిత ప్రవీణను అభినందించారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ విష్ణుమూర్తి మాట్లాడుతూ ఈ గ్రంథం ప్రాచీన వ్యాసాల నుంచి ఆధునిక సాహిత్యం వరకు అన్ని కోణాల్లోను సాగిందని, ప్రతి ఒక్కరూ దీన్ని చదవాలని కోరారు. కార్యక్రమంలో అధ్యాపకులు సహదేవుడు, శ్రీనివాస్, ప్రసాదరావు, మాధురి, వెంకటరావు పాల్గొన్నారు.

పాఠశాలకు ఆర్మీ ఉద్యోగి మొక్కల వితరణ



జెడ్పీ హైస్కూల్ ఆవరణలో మొక్కలు నాటుతున్న విద్యార్థులు

తగరపువలస: ఆనందపురానికి చెందిన ఆర్మీ ఉద్యోగి బి.తిరుపతిరావు స్థానిక జెడ్పీ హైస్కూల్‌కు శనివారం వంద మొక్కలు అందించారు. పనస, జామ తదతర మొక్కలను విద్యార్థులు నాటి నీరు పోశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు రామకృష్ణ పట్నాయక్, ఉపాధ్యాయుడు బి.ముత్యాలనాయుడు మాట్లాడుతూ విద్యార్థులు మొక్కల పెంపకాన్ని బాధ్యతగా చేపట్టి కాలుష్య నివారణకు తమ వంతు కృషి చేయాలని కోరారు.

బాలికను వేధిస్తున్న యువకుడికి దేహశుద్ధి

తగరపువలస: ఆనందపురం మండలం గొట్టిపల్లి పంచాయతీ వెంకటాపురంలో ఇంటర్ చదువుతున్న 17 ఏళ్ల బాలికను నెల రోజులుగా వేధిస్తున్న అదే గ్రామానికి చెందిన రవికుమార్ అనే యువకుడికి శనివారం గ్రామస్తులు దేహశుద్ధి చేసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. గతంలో పలుమార్లు హెచ్చరించినా యువకునిలో మార్పు రాకపోగా ఎందుకు బాలికను వేధిస్తున్నావని అదే గ్రామానికి చెందిన ఒక యువకుడు రవికుమార్‌ను శనివారం నిలదీశాడు. దీంతో ఇరువురి మధ్య కొట్లాట జరిగింది. రవికుమార్ మరో ముగ్గురిని తీసుకొచ్చి చందక కూడలిలో ఆ యువకునిపై దాడికి దిగాడు. దీంతో బాలిక బంధువులు ఆనందపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజలపై భారాలు ఆపకపోతే ఆందోళనలు తీవ్రతరం



పరదేశిపాలెంలో పాదయాత్ర ప్రారంభిస్తున్న సీపీఎం నేత కుమార్

మధురవాడ: ప్రభుత్వం ప్రజలపై భారాలు ఆపకపోతే ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆర్.కె.ఎస్.వి. కుమార్ హెచ్చరించారు. అధిక ధరలు, భారీగా పెంచిన విద్యుత్ చార్జీలకు వ్యతిరేకంగా, విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని, యువతకు ఉపాధి కల్పించాలని సీపీఎం రాష్ట్ర వ్యాప్తంగా చేపడుతున్న ప్రజాపోరు పాదయాత్రను శనివారం పరదేశిపాలెంలో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో అనేక హామీలిచ్చి అధికారంలోకి వచ్చాక ప్రజలపై ఆర్థిక భారాలు మోపుతుందే తప్పా.. సంక్షేమ, ప్రజా శ్రేయస్కర కార్యక్రమాలు కనిపించడం లేదన్నారు. ఎన్నడూ లేని విధంగా బియ్యం, కంది పప్పు, వంట నూనెలు, పంచదార చివరికి ఉల్లిపాయలు, టమాటోలు, కూరగాయల ధరలన్నీ భగ్గుమంటున్నాయని చెప్పారు. వీటి నియంత్రణకు కూటమి ప్రభుత్వం కనీస చర్యలు కూడా చేపట్టడం లేదన్నారు. నిత్యావసర వస్తువులను రేషన్ డిపోల ద్వారా సరఫరా చేయలని డిమాండ్ చేశారు. వచ్చే ఏడాదిలో మరో రూ.11 వేల కోట్లు విద్యుత్ చార్జీలు పెంచడానికి కూటమి ప్రభుత్వం సిద్ధమవుతోందని, ఇది సరికాదన్నారు. ఈ నెల 14 వరకు ప్రజాపోరు యాత్రలు నిర్వహించి ప్రజా సమస్యలు తెలుసుకుని, ప్రభుత్వం విధిస్తున్న వివిధ రకాల భారాలను వారికి తెలియజేస్తామన్నారు. తమ దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారం కోసం 14వ తేదీన మధురవాడ జోనల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తామని తెలిపారు. ఇంటింటికీ కరపత్రాలు పంచుతూ పాదయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు డి.అప్పలరాజు, డి.కొండమ్మ, బి.భారతి, ఎ.గురుమూర్తిరెడ్డి, కె.సుజాత, లీల, బి.అప్పలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పంచారామాలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

మధురవాడ డిపో సందర్శించిన ఆర్ఎం అప్పలనాయుడు



సిబ్బందితో మాట్లాడుతున్న ఆర్ఎం అప్పలనాయుడు

మధురవాడ: కార్తీక మాసాన్ని పురస్కరించుకుని పంచారామాలకు ప్రత్యేకంగా బస్సులు నడుపుతున్నట్టు ఆర్టీసీ రీజినల్ మేనేజర్ బి.అప్పలనాయుడు చెప్పారు. శనివారం సాయంత్రం ఆయన మధురవాడ ఆర్టీసీ డిపోని సందర్శించారు. ఈ సందర్భంగా గ్యారేజీని సందర్శించి సిబ్బందికి సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మధురవాడ, విశాఖపట్నం డిపోల నుంచి మంచి కండిషన్‌లో ఉన్న బస్సులను పంచారామాలకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం నడుపుతున్నట్టు చెప్పారు. వీటికి టిక్కెట్ రేట్లు స్పెషల్ సూపర్ లగ్జరీ రూ.2,150, అల్ట్రా డీలక్స్ రూ.2,100గా నిర్ణయించినట్టు చెప్పారు. అయ్యప్పస్వామి భక్తుల కోసం కూడా డిమాండ్‌ను బట్టి కండిషన్‌లో ఉన్న బస్సులు నడపటానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ అవకాశాన్ని అంతా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అవసరమైన వారు బస్సులు, టికెట్ల కోసం ఆయా డిపోల మేనేజర్లను సంప్రదించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన ట్రాఫిక్ సూపరింటెండెంట్ ఎం.దుర్యోదనుడు, మధురవాడ డిపో మేనేజర్ పీబీఎంకే రాజుకు సూచనలు చేశారు.

స్కూల్ బస్సుల సిబ్బందికి అవగాహన



సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ చిరంజీవిరావు

తగరపువలస: భీమిలి ట్రాఫిక్ ఎస్ఐ చింతలపూడి చిరంజీవిరావు శనివారం భీమిలి మండలం తాళ్లవలస తిరుమల విద్యాసంస్థలు, సంగివలస శశి విద్యాసంస్థల్లో బస్ డ్రైవర్లు, హెల్పర్లకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఓవర్ స్పీడ్, రాష్ డ్రైవింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్, సమయపాలన, చిన్నారులను తీసుకు వెళ్లేటప్పుడు, దించేటప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలను తెలియజేశారు. హెల్పర్లు, డ్రైవర్లు సమన్వయంతో పనిచేసి ప్రమాదాల నియంత్రణకు కృషి చేయాలని ఎస్ఐ కోరారు.

అంగన్‌వాడీ కేంద్రంలో కుళ్లిన కోడిగుడ్లు



చిల్లపేట అంగన్‌వాడీ కేంద్రం ద్వారా పంపిణీ చేసిన కుళ్లిన కోడిగుడ్లు

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ రెండో వార్డు చిల్లపేట అంగన్‌వాడీ కేంద్రం ద్వారా పంపిణీ చేసిన కోడిగుడ్లు కుళ్లిన వాసనతోపాటు పురుగులు రావడంతో లబ్ధిదారుల కుటుంబం అవాక్కపోయింది. బాలింత కుటుంబం ఆమ్లెట్ వేయడానికి శనివారం సాయంత్రం మూడు గుడ్లు పగలగొట్టగా.. వాటిలో నుంచి పురుగులు, నీలం రంగు ద్రవం బయటపడింది. గుడ్ల నుంచి దుర్వాసన రావడంతో కడుపులో మెలితిప్పినట్టు అనిపించి బయట పారవేశారు. పౌష్టికాహారం పేరుతో కాలం చెల్లిన కోడిగుడ్లు సరఫరా చేస్తున్నారని బాధిత కుటుంబం వాపోయింది.

'ఆ భూమి రంగనాథ స్వామి ఆలయానిదే..'



పాలవలస పంచాయతీ గుడిలోవలోని రంగనాథ స్వామి ఆలయం

తగరపువలస: ఆనందపురం మండలం పాలవలస పంచాయతీ గుడిలోవ గ్రామ సర్వే నంబర్ 69లో ఉన్న 26 ఎకరాల 25 సెంట్ల భూమి రంగనాథ స్వామి ఆలయానికి చెందినదేనని హైకోర్టు తీర్పు ఇచ్చింది. ఈ మేరకు ఆలయ ఈవో ఎస్.నానాజీ బాబు శనివారం వివరాలు వెల్లడించారు. ఈ స్థలాలకు సంబంధించి 15 ఏళ్ల కిందట దేవస్థానానికి వ్యతిరేకంగా హైకోర్టులో రెండు రిట్ పిటీషన్లు దాఖలయ్యాయన్నారు. ఈ రెండు కేసులను కొట్టి వేస్తూ హైకోర్టు దేవస్థానానికి అనుకూలంగా తీర్పు ఇచ్చిందని తెలిపారు. ప్రస్తుతం ఈ భూమి విలువ రూ.60 కోట్లు ఉంటుందని చెప్పారు. దేవస్థానం తరపున అడ్వకేట్ ఎస్.వి.ఎస్.ప్రసాద్‌వర్మ వాదించారన్నారు.

నైపుణ్యాలతో ఉద్యోగావకాశాలు

- అవంతి విద్యాసంస్థల చైర్మన్ ముత్తంశెట్టి శ్రీనివాసరావు



సదస్సు ప్రారంభిస్తున్న మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు

తగరపువలస : నవకల్పనల నైపుణ్యాలతోనే ఉద్యోగావకాశాలు మెరుగుపరచుకోవచ్చని మాజీ మంత్రి, అవంతి విద్యాసంస్థల చైర్మన్ ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. చెరకుపల్లి అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం ఆయన హెచ్‌ఆర్‌ల సదస్సు నిర్వహించారు. విశాఖ రీజియన్‌లోని వివిధ పారిశ్రామిక సంస్థలకు చెందిన హెచ్‌ఆర్‌లు ఇందులో పాల్గొని విద్యార్థుల సందేహాలకు సమాధానాలిచ్చారు. ఈ సందర్భంగా ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ విస్తృతంగా ఉన్న ఉద్యోగావకాశాలను యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతీ విద్యార్థి ఉద్యోగ సాధనకు అవసరమైన శిక్షణ కార్యక్రమాలు తాము నిర్వహిస్తున్నామన్నారు. ఇలాంటి పారిశ్రామిక సదస్సులు మరిన్ని నిర్వహిస్తామన్నారు. ఫ్యూనోమ్యాపిల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పిండి శ్రీనివాస మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి ఉద్యోగం సాధించాలన్న కోరిక ఉంటుందని, అందుకు తగ్గట్టుగా నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలన్నారు. టెక్నికల్, సాఫ్ట్ స్కిల్స్ పెంచుకోవాలన్నారు. ఏపీపీ టాలెంట్ అక్విజిషన్ చౌరాషియాకు చెందిన రామ నారాయణ, దాసరి కిషోర్, పుణ్యోల్‌మంతుల నరేష్, శేషసాయి, ప్రతిమ జోష్‌ఫైన్, శుభశ్రీ మహాపాత్రా మాట్లాడుతూ నైపుణ్యాలతోపాటు పాజిటివ్ థింకింగ్ పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అవంతి విద్యాసంస్థల వైస్ ప్రెసిడెంట్ సందీప్, డైరెక్టర్ ఆకుల చందరశేఖర్, ప్రిన్సిపాళ్లు బి.మురళీకృష్ణ, మోహన్‌రావు, గోవిందరావు, రాజు, రామకృష్ణ, ప్లేస్‌మెంట్ అధికారులు శ్రీనివాసరావు, రూప్ సుందర్ పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఆర్థిక సాయం

పీఎం పాలెం: జీవీఎంసీ ఆరో వార్డు పీఎం పాలెం ఆర్‌హెచ్ కాలనీలో శాశ్వత అంగవైకల్యంతో బాధపడుతున్న ఇద్దరికి బిల్డర్ వాండ్రాసి అప్పలనాయుడు రూ.5 వేల చొప్పున శనివారం ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఆగని తాగునీటి అక్రమ రవాణా



కాపులుప్పాడలో ట్యాంకర్‌లో నీరు నింపుతున్న దృశ్యం

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డు కాపులుప్పాడలో తాగునీటి అక్రమ రవాణా జోరుగా కొనసాగుతోంది. తెల్లవారుజాము నుంచి రాత్రి వరకు భారీ ట్యాంకర్ల ద్వారా మంచి నీటిని రవాణా చేస్తున్నారు. ఈ అక్రమ రవాణా గురించి రెవెన్యూ, జీవీఎంసీ అధికారులకు తెలిసినప్పటికీ చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. కె.నగరపాలేనికి చెందిన టీడీపీ నాయకుడు యథేచ్ఛగా కాపులుప్పాడ వద్ద భారీ ట్యాంకర్ల ద్వారా అనధికారికంగా తాగునీటి రవాణా చేస్తున్నా.. ఒక్కసారి కూడా అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై స్థానికులు మండిపడుతున్నారు. రోజుకు వేల లీటర్లలో నీటిని తరలించడంతో ఇక్కడ భూగర్భ జలాలు ఎండిపోతున్నాయని, దీనిపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని అధికారులను ప్రశ్నిస్తున్నారు. పట్టపగలు యథేచ్ఛగా రోజుకు పదుల సంఖ్యలో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నా ఒక్క వాహనాన్ని కూడా అధికారులు స్వాధీనం చేసుకోకపోవడానికి గల కారణాలు తెలియాల్సి ఉంది. రెవెన్యూ, జీవీఎంసీ అధికారులు సమన్వయంతో తాగునీటి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు.

నగలు అపహరించిన మహిళ అరెస్ట్

పీఎం పాలెం: బంగారు ఆభరణాలు, నగదు అపహరించిన మహిళను పీఎం పాలెం పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఇందుకు సంబంధించి స్థానిక నేర విభాగం ఎస్ఐ ఆర్.శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం ... మల్కాపురం ప్రాంతానికి చెందిన కె.రామలక్ష్మి నాలుగు రోజుల కిందట గాజువాక మీదుగా క్రికెట్ స్టేడియం ఎదురుగా ఉన్న కుమారుని నివాసానికి తన ఇంటి నుంచి బయలుదేరింది. ఈ ప్రయాణంలో తన బ్యాగులో భద్రపరిచిన 12.5 తులాల బంగారు ఆభరణాలు, 5 తులాల వెండి వస్తువులు, రూ.5 వేల నగదు గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసినట్టు కుమారుని ఇంటి వద్ద గుర్తించి వెంటనే పీఎం పాలెం నేర విభాగం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా విజయనగరం జిల్లా కొత్తవలస మండలం, 202 కాలనీకి చెందిన ఆర్.పార్వతి (27) చోరీకి పాల్పడినట్లు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. ఆమె దొంగలించిన బంగారు ఆభరణాలు, నగదు స్వాధీనం చేసుకుని శనివారం రిమాండ్‌కు తరలించారు.

బంగ్లామెట్ట పాఠశాల పరిశీలన



బంగ్లామెట్ట జీవీఎంసీ పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు

తగరపువలస: తరళ్ జిల్లా సమన్వయకర్త శంకర్ శనివారం బంగ్లామెట్ట ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల స్థాయిని పరిశీలించి బేస్‌లైన్‌లో మార్కులను ఆన్‌లైన్‌లో పూర్తి చేయడం పట్ల ఉపాధ్యాయులను అభినందించారు. చదవడం, రాయడంలో మంచి ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కూడా అభినందించారు. వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు. బోధనాభ్యసన సామగ్రిని పరిశీలించారు. విద్యార్థులతో స్వయంగా మైండ్ మ్యాపింగ్ చేయించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రెడ్డిపల్లి అప్పలరాజు, ఉపాధ్యాయులు బుగత మల్లిక, ఈగల సంజీవి, తదితరులు పాల్గొన్నారు.